# ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేదీ.15-06-2025 సమయం 13.10 గంటలు

### ముఖ్యాంశాలు

1. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 12 లక్షల 48 వేలకు పైగా కేసులు పరిష్కారమయ్యాయి.
2. రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.
3. రాష్ట్రానికి ఆదాయ వనరులను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు.
4. రాష్ట్రంలో పలు చోట్ల ఈ రోజు, రేపు ఒక మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

.................................................

మంత్రి వివేక్:

రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయ వనరులను పెంచడమే తమ లక్ష్యమని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత, మొదటి సారి చెన్నూరు నియోజక వర్గం పర్యటనలో భాగంగా... ఈ రోజు మందమర్రి, క్యాతన్ పల్లి ప్రాంతాల్లో పర్యటించిన మంత్రికి... సింగరేణి కార్మికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపుతామని మన్నారు. మంచిర్యాల జిల్లాలో కొత్త గనులకు కోసం కృషి చేస్తాననీ... దీంతో ఆ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలో

చెన్నూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా పని చేస్తానని మంత్రి చెప్పారు.

-పీటీసీ, మంచిర్యాల

## TELANGANA- NATIONAL LOK ADALAT

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ (TSLSA) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో.... నిన్న ఒక్క రోజే 12 లక్షల 48 వేలకు పైగా కేసులు పరిష్కారమయ్యాయి. తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్, జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి నేతృత్వంలో హైకోర్టు, రుణ రికవరీ ట్రిబ్యునళ్లతో సహా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 319 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. జస్టిస్ సుజోయ్ పాల్ సికింద్రాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమ కేసులను సామరస్యంగా పరిష్కరించుకున్న న్యాయవాదులకు ఆయన లోక్ అదాలత్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సుజోయ్ పాల్ మాట్లాడుతూ... లోక్ అదాలత్‌ల వ్యవస్థ పురాతనమైనది అయినప్పటికీ, ప్రభావవంతమైన వ్యవస్థ అని పేర్కొన్నారు. లోక్ అదాలత్... విలువైన కోర్టు సమయాన్ని ఆదా చేయడంతో పాటు కక్షిదారుల మధ్య సద్భావనను పెంపొందిస్తుందని అన్నారు. లోక్ అదాలత్ 4,63,038 ప్రీ-లిటిగేషన్ కేసులను... 7,85,011 కోర్టు కేసులను పరిష్కరించింది. ఈ కేసుల రాజీతో కక్షిదారులకు 935 కోట్ల రూపాయల పరిహారం లభించనుంది.

-NSD/MSL

మాజీ సర్పంచ్ - దీక్ష

యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో గతంలో శంకుస్థాపన చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలను మరో ప్రాంతానికి తరలించ వద్దని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్ కర్రె వెంకటయ్య స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. మల్లాపురం అభివృద్ధికి దొరికిన అవకాశాన్ని వేరే ప్రాంతానికి తరలించే అంశంపై ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పందించాలని కోరారు.

- పీ టీ సీ, యాదాద్రి భువనగిరి

బంద్:

కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న ఆపరేషన్ కగార్ లో... వేర్వేరు ఎన్ కౌంటర్ లలో తెలుగు రాష్ట్రాల కు చెందిన మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో.... మావోయిస్ట్ పార్టీ ఈ నెల 20న తెలుగు రాష్ట్రాలలో బంద్ కు పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్ట్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ విడుదల చేసారు.

- పిటిసీ, మంచిర్యాల

**GKR-PM:**

దేశ స్వావలంబనకు కీలక పాత్ర పోషిస్తున్న బొగ్గు గనుల శాఖని పటిష్టం చేయటంలో... ఆ శాఖ కేంద్ర మంత్రి G కిషన్ రెడ్డి ముందున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. కిషన్ రెడ్డి క్షేత్ర స్థాయినుంచి ఎదిగిన నాయకుడని పేర్కొన్నారు. కిషన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రధానమంత్రి ఆయనకు సామాజిక మాధ్యమం X వేదికగా ఈ రోజు శుభాకాంక్షలు తెలిపారు.

-MSL

వాతావరణం:

రాష్ట్రంలో ఈ రోజు, రేపు ఒక మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ రోజు రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాం గద్వాల్ జిల్లాలలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది.

-డెస్క్

**పటేల్:**

స్వాతంత్ర సమర యోధుడు, దేశ తొలి హోంమంత్రి సర్దార్ పటేల్ జాతికి ఎనలేని సేవలందించారని... రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్ విలీనంతో పాటు, దేశంలోని అరాచక శక్తుల ఆటలు కట్టించిన ఘనత సర్దార్ పటేల్ దని ఆయన శ్లాఘించారు. హైదరాబాద్ లోని కుత్బుల్లాపూర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఈ ఉదయం ఆవిష్కరించారు.

-MSL

**నకిలీ విత్తనాలు:**

ఆసిఫాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాల ఉత్పత్తి, పంపిణీపై ఉక్కు పాదం మోపుతామని జిల్లా ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇతర జిల్లాల నుండి పొరుగు రాష్ట్రాల నుండి నకిలీ విత్తనాలు రాకుండా ప్రత్యేక చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

- పిటిసి, ఆసిఫాబాద్

**గిరిజనులు:**

గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న పథకాలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో... జనగామ జిల్లాలో ధర్తీ ఆబ జన్ భాగీధారి అభయాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఆరు మండలాల్లో ఎంపిక చేసిన తొమ్మిది గిరిజన గ్రామ పంచాయతీలలో ఈ రోజు నుండి జులై 15 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గిరిజిన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం లో భాగంగా... ఆధార్, రేషన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు.., ఆయుష్మాన్ భవ, జీవిత బీమా కవరేజ్... వృద్ధాప్య, వితంతు పెన్షన్ తదితర పత్రాలు లేని వారి నుండి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో దరఖాస్తు పత్రాలను స్వీకరిస్తారు.

- పిటిసి, జనగామ

**గద్దర్ అవార్డులు:**

రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇందులో సినీ పరిశ్రమ భాగం కావాలని అన్నారు.

హైదరాబాద్ హైటెక్స్ లో నిన్న సాయంత్రం జరిగిన **తెలంగాణ గద్దర్ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం-2024** కార్యక్రమంలో విజేతలకు ముఖ్యమంత్రి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... చైతన్యం, విప్లవాలకు ప్రతీకగా నిలిచిన జానపద గాయకులు గద్దర్ పేరు మీద అవార్డులు ఇవ్వడం తమ ప్రభుత్వానికి గర్వకారణమని అన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతూ..., సినిమా, ఐటీ రంగాలకు సమాన ప్రోత్సాహం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

-MSL

**ఫిలిం జ్యూరీ:**

గద్దర్ ఫిలిం జ్యూరీ అవార్డుల కమిటీలో ఆసిఫాబాద్ జిల్లా వాసి మసాడే లక్ష్మీనారాయణకి చోటు లభించడం పట్ల జిల్లాలోని ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా పాత్రికేయునిగా సేవలందిస్తున్న ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా నిన్న అవార్డు అందుకున్నారు.

- ఆసిఫాబాద్ జిల్లా పిటిసి

**ఉత్తమ్:**

గోదావరి-బనకచర్ల టెండర్లపై తదుపరి చర్యలు తీసుకోకుండా... ఆంధ్రప్రదేశ్ ను ఆదేశించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆయన ఒక లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ సమర్పించిన ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ రిపోర్ట్ కు ఆమోదం తెలపకముందే... డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) ఇవ్వాలని అడగటాన్ని ఆయన ఆక్షేపించారు. రాష్ట్ర నదీ జలాల హక్కులకు గత ప్రభుత్వం నష్టం కలిగించిందని ఉత్తమ్ కుమార్ ఆరోపించారు.

-డెస్క్

**AXIOM-4**

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా... భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో సహా నలుగురి అంతరిక్ష ప్రయాణం ఈనెల 19వ తేదికి వాయిదా పడినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. ఈ మిషన్ లో సాంకేతిక సమస్యలను విజయవంతంగా పరిష్కరించిన తర్వాత ఈ ప్రకటన వెలువడింది.

-NSD

**మరమగ్గాల కార్మికులు:**

నేతన్న పొదుపు పథకంలో చేరేందుకు అర్హత గలవారు ఈనెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు జి.రాఘువరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి మరమగ్గాల కార్మికులు, అనుబంధ రంగాలైన డైయింగ్, డిజైనింగ్, వార్పిన్, వైండింగ్, సైజింగ్, వైపని, బ్లీచింగ్, రోలింగ్, గమ్మింగ్ కార్మికులు అర్హులు. మరమగ్గాల కార్మికులు నెలకు గరిష్ఠంగా 1,200 రూపాయలు, అనుబంధ రంగాల కార్మికులు 5,800 రూపాయలు చెల్లిస్తే... అంతే మొత్తాన్ని కలిపి ప్రభుత్వం వారిపేరు మీద జమచేస్తుంది. రెండేళ్ల తర్వాత మొత్తం డబ్బును వడ్డీతో సహా కలిపి కార్మికులకు అందిస్తారు.

-పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**యాదాద్రి:**

ప్రముఖ పుణ్య క్షేత్రం యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఇవాళ సెలవు రోజు కావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు మూడు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గంటల పాటు సమయం పడుతోంది.

- పీ టీ సీ యాదాద్రి భువనగిరి